జెట్టీ నిర్మాణంపై నీలినీడలు



చింతపల్లి సముద్ర తీరంలో జెట్టీ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం ఇదే..(ఫైల్)

- చింతపల్లిలో జెట్టీ నిర్మాణంపై ప్రభుత్వం జాప్యం
- వైఎస్సార్ సీపీ హయాంలోనే పనులకు శంకుస్థాపన, రూ.23 కోట్ల నిధుల మంజూరు
- మత్స్యకారుల అభివృద్ధిని విస్మరించిన కూటమి సర్కారు
- అవస్థలు పడుతున్న గంగపుత్రులు

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి సముద్రతీరాన చేపట్టాల్సిన జెట్టీ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే ఇక్కడి జెట్టీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం, రూ.23 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కారు మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరిస్తోంది. గత ప్రభుత్వం అమలు చేసిన మత్స్యకార భరోసా పథకం కూడా అమలుచేయక పోగా, ఇప్పుడు వారి అభివృద్ధికి దోహదపడే జెట్టీ నిర్మాణం ఊసెత్తడం లేదు. దీంతో గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు అత్యంత అవసరమైన జెట్టీ నిర్మాణంపై జాప్యమెందుకు అని నిలదీస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో తీరప్రాంతాలైన పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో సుమారు 21 వేల మంది మత్స్యకారులు నివశిస్తున్నారు. వీరిలో 6 వేల మంది చేపల వేటనే ప్రధాన వృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. మిగతా 15 వేల మంది వారిపై పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారు. ఆయా మండలాల్లో 885 బోట్లులో 3,798 మంది మత్స్యకారులు నిత్యం చేపలవేట చేస్తుంటారు. వేట లేకపోవడం, వివిధ కారణాల రీత్యా మరో 2,500 మంది మత్స్యకారులు బతుకుతెరువు కోసం విశాఖపట్నం, గుజరాత్, సూరత్, హీరావల్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. తీరంలో జెట్టీ నిర్మాణం కాకపోవడంతో విపత్తుల సమయంలో పడవలు, వలలు సముద్రంలోకి కొట్టుకుపోయి భారీగా నష్టాలు చవిచూస్తున్నామని మత్స్యకారులు వాపోతున్నారు.

కాలుష్యం.. పొట్ట కొడుతోంది..

జెట్టీ సమస్యతో పాటు సముద్రంలో నిత్యం కలుస్తున్న రసాయన పరిశ్రమల వ్యర్థాలు తమ పొట్ట కొడుతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలం క్రితం వరకు చేపల వేటకు సముద్రంలోకి వెళ్తే భారీగా చేపలు వలకు చిక్కేవి. నేటి పరిస్థితి చూస్తే దానికి భిన్నంగా ఉంది. పరిశ్రమల నుంచి సముద్రంలోకి విడుదల చేస్తున్న వ్యర్థాల కారణంగా మత్స్య సంపద నాశనమవుతోందని, ఒక్కోసారి వేటకు వెళ్లి, ఖాళీ వలలతో రావాల్సిన దుస్థితి ఏర్పడిందని మత్స్యకారులు అంటున్నారు.

జీవనోపాధి కోల్పోతున్నాం..

పరిశ్రమల వ్యర్థాల కారణంగా మత్స్య సంపద తగ్గుతోంది. చేపల వేట అనే జీవనోపాధిని కోల్పోతున్నాం. కొత్తగా వచ్చిన ప్రభుత్వం త్వరగా జెట్టీ నిర్మాణ పనులు చేపట్టి, ఆదుకోవాలి. సకాలంలో పనులు పూర్తయి, జెట్టీని వినియోగంలోకి తీసుకురావాలి.

– బి.కొర్లయ్య, చింతపల్లి

ఆలస్యం చేయకుండా జెట్టీ కట్టాలి..

ఆలస్యం చేయకుండా జెట్టీ నిర్మాణ పనులు ప్రారంభించాలి. జెట్టీ లేని కారణంగా వేట చేసిన తర్వాత ఒడ్డుకు చేరిన బోట్లుకు రక్షణ లేకుండా పోయింది. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు భారీగా నష్టపోతున్నాం. గత ప్రభుత్వం జెట్టీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, శంకుస్థాపన కూడా చేసింది. ప్రస్తుత ప్రభుత్వం నిర్మాణం తప్పనిసరిగా చేయాలి. – బి.అప్పలస్వామి, బర్రిపేట

విగ్రహాల ధ్వంసం ఓ పనికిమాలిన చర్య



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

- మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: విగ్రహాలు ధ్వంసం చేయడమనేది ఓ పనికిమాలిన చర్య అని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణంలో విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనం శిలాఫలకం, అంబేడ్కర్ విగ్రహంపై టీడీపీ శ్రేణులు దాడికి ఎగబడడాన్ని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ శనివారం చేపట్టారు. అనంతరం స్థానిక హరిజన కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహా న్యాయ శిల్పాన్ని సైతం పడగొట్టేందుకు చేసే కుట్ర చాలా బాధాకరమన్నారు. అంబేడ్కర్ విగ్రహం దాడి వెనక ఎంతటి పెద్ద వ్యక్తులున్నా ప్రభుత్వం పట్టుకుని, చర్యలు తీసుకోవాలన్నారు. అంబేడ్కర్ విగ్రహంపై జరిగిన దాడి యావత్తు భరతజాతిని అగౌరపరచడమేనన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హింస విపరీతంగా పెరిగిపోయిందన్నారు. ఇలాంటి ఘటనలు జరుగుతుంటే అసలు ప్రజాస్వామ్యంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పరిపాలనపై దృష్టిసారించాలని, దాడులు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, గుజ్జు సురేష్‌రెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి, మహంతి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి సాంబశివరాజు సేవలు మరువలేనివి



సాంబశివరాజు స్మృతివనం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు తదితరులు

నెల్లిమర్ల రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు చేసిన సేవలు మరువలేనివని ఆయన తనయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు కొనియాడారు. మండలంలోని మొయిద గ్రామంలో సాంబశివరాజు వర్ధంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సాంబశివరాజు స్మృతివనం వద్ద నివాళులర్పించి, కాసేపు మాట్లాడారు. రాష్ట్ర మంత్రిగా సాంబశివరాజు ప్రజలకు ఎన్నో సేవలను చేశారని, విలువలతో కూడిన రాజకీయాలకు ఆయనే నిదర్శనమన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, నాయకులు వెంకటరమణ, అప్పలనాయుడు, కనకాకారావు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు



బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం సీనియర్ నేత బుద్ధదేవ్ భట్టాచార్య మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని, ఆయన స్ఫూర్తితోనే ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు అధ్యక్షతన బుద్ధదేవ్ భట్టాచార్య సంతాప సభ శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1968లో పశ్చిమబెంగాల్ డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా, 1971లో పార్టీ రాష్ట్ర కమిటీకి సభ్యునిగా, 1982లో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా, 1985లో పార్టీ 12వ మహాసభల్లో కేంద్ర కమిటీ సభ్యులుగా, 2000–2015 వరకు పొలిట్‌బ్యూరో సభ్యులుగా కొనసాగి, పార్టీ విధివిధానాలు రూపొందించడంలో గణనీయమైన కృషి చేశారన్నారు. మూడు దశాబ్దాల పాటు ముఖ్యమంత్రిగా, మంత్రిగా విశిష్టమైన సేవలందించారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ బుద్ధదేవ్ అంకితభావంతో కూడిన కమ్యూనిస్ట్‌గా, అత్యంత సాధారణ జీవితాన్ని గడిపారన్నారు. ముఖ్యమంత్రి అయినప్పటికీ నిరాడంబరంగా రెండు గదుల అపార్ట్‌మెంట్‌లోనే నివశించారని కొనియాడారు.

మందులు భద్రపరచడంలో జాగ్రత్త వహించండి

సాక్షి ఎఫెక్ట్...

విజయనగరం ఫోర్ట్: మందులు, సర్జికల్ మెటీరియల్‌ను భద్రపరచడంలో తగిన జాగ్రత్త వహించాలని ఫార్మసీ చీఫ్ ఆఫీసర్‌కు సూచించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ శంబంగి అప్పలనాయుడు శనివారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మందులకు చెదలు పట్టాయనే వార్తను అధికారుల నిర్లక్ష్యం శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురించగా సంబంధిత అధికారులు స్పందించారు. ఎప్పటికప్పుడు మందులు ఏ విధంగా ఉన్నాయోనని పర్యవేక్షణ చేయాలని సిబ్బందిని అధికారులు ఆదేశించారు. ఇకనుంచి ఆ పొరపాటు జరగకుండా చూసుకుంటామని సిబ్బంది కూడా తెలిపినట్లు సమాచారం.

బహుముఖ ప్రజ్ఞాశాలి శేషసాయి



మానాప్రగడ శేషసాయి పురస్కారం అందుకుంటున్న కట్టమూరి చంద్రశేఖరమ్

విజయనగరం: నగరంలోని గురజాడ విద్యాసంస్థల ప్రాంగణంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మానాప్రగడ శేషసాయి స్మారక పురస్కార ప్రదానోత్సవం శనివారం నిర్వహించారు. 2024 ఏడాదికి గాను ప్రముఖ వైద్యుడు డాక్టర్ గేదెల తిరుపతి, తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సముద్రాల గురుప్రసాద్, జక్కు రామకృష్ణ, డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరమ్‌లకు ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత కట్టమూరి చంద్రశేఖరమ్ మాట్లాడుతూ విజయనగర సాహితీ లోకంలో వెలుగు పూలు పూయించిన శేషసాయి.. ఓ అసమాన పద్య కవితాధురీణుడు అని కొనియాడారు. కొన్ని దశాబ్దాల పాటు తెలుగు, సంస్కృత సాహిత్యాలను తనదైన శైలితో ప్రభావితం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి శేషశాయి అని అన్నారు. దక్షిణాపథానికే తలమానికమైన విజయనగర ప్రభుత్వ మహారాజా సంస్కృత కళాశాలకు అధ్యక్షులుగా వ్యవహరించి, సంస్కృత సరస్వతిని సకలోపచారాలతో చక్కని పూలపల్లకిలో ఊరేగించారన్నారు. కార్యక్రమంలో రాజాం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్న హైందవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఏపీ ఎస్ఐఆర్‌డీ కృష్ణమోహన్



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నెల్లిమర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.రామారావు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులుగా ఇస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఏపీ ఎస్ఐఆర్‌డీ ఏసీ కృష్ణమోహన్ ఈ తరగతులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర అని, సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కె.సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.
నెల్లిమర్ల రూరల్: శిక్షణ తరగతుల్లో భాగంగా మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులంతా మండలంలోని కొత్తపేట గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఏపీ ఎస్ఐఆర్‌డీ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలని, చెత్తను కాలువల్లో వేయకుండా కార్మికులకు అందజేయాలని సూచించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామారావు, ఈవోపీఆర్‌డీ సింహాద్రి, సర్పంచ్‌లు పతివాడ అప్పన్న, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్‌తో కమాండ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్

శృంగవరపుకోట: ఎన్‌సీసీలో చేరడం ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని, క్రమశిక్షణతో పాటు గొప్పవ్యక్తిత్వాన్ని అలవర్చుకోవచ్చని ఆంధ్రా బెటాలియన్ కమాండ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీ సీ యూనిట్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఎన్‌సీసీ యూనిట్‌లో క్యాడెట్లు నిర్వహిస్తున్న విధులు, బాధ్యతలు, సేవాకార్యక్రమాలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ లక్ష్యాలను, విధులను, ఉద్దేశ్యాన్ని మరోమారు క్యాడెట్లకు వివరించారు. శరీరాన్ని శారీరకంగా, మానసికంగా ధృడంగా సిద్ధం చేసుకోవడం మన చేతుల్లో పని అనా అన్నారు. ఎన్‌సీసీ మీ వ్యక్తిగత జీవితంతో పాటూ దేశానికి మీరు ఉపయోగపడేలా సిద్ధం చేస్తుందన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు మాట్లాడుతూ ఎన్‌సీసీ– 'సి' సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలు సాధిస్తు న్నారని, రెండేళ్లుగా తమ విద్యార్థులు అగ్నిపథ్‌కు ఎంపికయ్యారని చెప్పారు. ఎన్‌సీసీ ఆఫీసర్ షేక్ వలీఖాన్, అధ్యాపకులు కె.వాసుదేవరావు, డాక్టర్ సుధీర్, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ జి.ఈరన్న పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



యూటీఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న సంఘ రాష్ట్ర నాయకుడు రాము

విజయనగరం అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు డి.రాము తొలుత యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం యూటీఎఫ్ ఆవిర్భావ ఉద్దేశ్యం, చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ వంటి ఆశయాలతో ఏర్పడి 50 ఏళ్ల కాలంలో విద్యారంగం బలోపేతానికి యూటీఎఫ్ కృషి చేయడం జరిగిందన్నారు. పాలకులు తీసుకువస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టి, ప్రత్యామ్నాయ విద్యా విధానాలు తీసుకురావడం జరుగుతోందన్నారు. యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని, పట్టణ శాఖల్లో ఒకరోజు, జిల్లా శాఖలో నవంబర్ 16, 17వ తేదీల్లో, కాకినాడలో డిసెంబర్ 14వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు స్వర్ణోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, ఆర్‌ఏవీ సూర్యారావు, సీహెచ్ తిరుపతినాయుడు, కె.ప్రసాదరావు, జి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అమృతశ్రీ వర్షిణి సంగీత పాఠశాలకు గరుడ అవార్డులు



గరుడ అవార్డులతో అమృత శ్రీవర్షిణి సంగీత, నృత్య పాఠశాల డైరెక్టర్లు, విద్యార్థులు

విజయనగరం టౌన్: జాతీయ నృత్యోత్సవాల్లో భాగంగా విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో హైదరాబాద్‌కు చెందిన కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక నగరానికి చెందిన అమృతశ్రీ వర్షిణి సంగీత, నృత్య పాఠశాలకు గరుడ అవార్డులు లభించినట్లు పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ తెలికిచర్ల శనివారం తెలిపారు. నృత్య విభాగంలో నృత్య దర్శకురాలు సౌమ్య తెలికిచర్లకు గరుడ అవార్డు, సామాజిక సేవా విభాగంలో అనిల్‌కు నటరాజ నంది అవార్డులు లభించాయి. వీరితో పాటు పాఠశాలలో నృత్య అభ్యసనం చేస్తున్న 21 మంది విద్యార్థులు ఆ కార్యక్రమంలో నృత్య ప్రదర్శనలు ఇచ్చి, గరుడ, నంది, నటరాజ పురస్కారాలు అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో గిన్నిస్ బుక్ రికార్డ్ హోల్డర్ బిందు లిమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరీ



గాత్ర కచేరీ చేస్తున్న ప్రాతా కృష్ణమూర్తి

విజయనగరం టౌన్: స్థానిక ఆర్య సోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రాతా కృష్ణమూర్తి శనివారం చేసిన గాత్ర కచేరీ ఆహూతులను ఆద్యంతం అలరించింది. వయోలిన్‌పై ఎం.శ్యామ్ నీలాద్రి, మృదంగంపై డాక్టర్ పత్రి సతీష్‌కుమార్‌లు సహకరించారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



హోమం చేస్తున్న భక్తులు

విజయనగరం: స్థానిక శ్రీక్షేత్రంలోని అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సుదర్శన హోమం భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, చామర్తి శ్రీనివాస రమేష్ వేదమంత్రాల నడుమ శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఈ హోమం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి



ఎస్ఎంసీ చైర్మన్ త్రినాథ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: నూతనంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, సభ్యులంతా పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు సూచించారు. మండలంలోని మొయిద ఉన్నత పాఠశాల చైర్మన్‌గా ఎన్నికైన చందక త్రినాథ్‌ను ఎమ్మెల్సీ శనివారం అభినందించారు. పాఠశాల ప్రగతితో పాటు మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సర్పంచ్ కృష్ణ, నాయకులు గోవింద, అప్పారావు, లక్ష్మణరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



మంత్రి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న లోక్‌సత్తా పార్టీ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: నగరంలోని మహాకవి గురజాడ అప్పారావు గృహాన్ని ఆధునీకరించాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. మహాకవి అప్పారావు ఇల్లు మురికి కూపంగా తయారైందని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఏటా గురజాడ జయంతి, వర్ధంతి చేసిన తర్వాత ఆ గృహాన్ని అలా వదిలేస్తున్నారని, మీరైనా పట్టించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రతినిధులు అల్లంశెట్టి నాగభూషణం, పార్టీ పట్టణ అధ్యక్షుడు తాత్రాజు రాజారావు, కార్యదర్శి పీఎల్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు పాటించండి



ప్రజలకు అవగాహనకల్పిస్తున్న వైద్యాధికారి వెంకటేష్

గంట్యాడ: మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ సూచించారు. పెదవేమలి గ్రామంలో ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా వరకు వ్యాధులు దోమల వల్లే వ్యాప్తి చెందుతాయని, దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంట్లో, నివాస పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు, చెత్త నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన తర్వాత రోజుల తరబడి ఇంట్లోనే ఉండిపోకుండా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని చెప్పారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలని, నిల్వ ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్ తినకూడదని తెలిపారు. ఎంపీహెచ్ఈఓ ఎర్రన్న, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏఎన్ఎం పార్వతి తదితరలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



బాధితుడికి నగదు అందజేస్తున్న ఏఎస్ఐ కామేశ్వరరావు, ఆశయ రమణ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న గరివిడి మండలంలోని కొండల క్ష్మీపురం గ్రామానికి చెందిన వెంపడాపు కాళిదాసు అనే యువకుడికి సహృదయ ఫౌండేషన్ వైద్యఖర్చుల నిమి త్తం రూ.10వేలు సహాయం చేసింది. కాళిదాసుకు గతం బ్రెయిన్ ఆపరేషన్ జరిగింది. రెండోసారి ఆరోగ్య సమస్య తలెత్తడంతో గతేడాది మళ్లీ ఆపరేషన్ చేయించారు. నెలకు రూ.8 వేలు మందుల ఖర్చులకు అవుతు న్నాయి. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఆ కుటుంబానికి సహాయం చేయా లని అదే గ్రామానికి చెందిన, గుర్ల ఏఎస్ఐగా పనిచేస్తున్న బెల్లాన కామేశ్వరరావు, చీపురుపల్లి ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ సహృదయ ఫౌండేషన్ అధ్యక్షురాలు తాడివాక బిందును కోరారు. దీంతో ఆమె స్పందించి రూ.10 వేలు సమకూర్చారు. నగదును బాధితుడికి ఏఎస్ఐ కామేశ్వరరావు, రమణ శనివారం అందజేశారు. గ్రామస్తులు బాలకృష్ణ, పోలినాయుడు పాల్గొన్నారు.

మద్యంసీసాల ధ్వంసం

గుర్ల: మండలంలో ఇదివరకు ఎస్ఈబీ అధికారులు 11 కేసుల్లో సీజ్ చేసిన 97 మద్యం సీసాల ను ఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశా ల అనుసారం మద్యం సీసాలను ధ్వంసం చేశామని ఎస్ఐ చెప్పారు. అక్రమంగా మద్యం తర లించే వారిపై నిఘా పెట్టామని తెలిపారు.